క్లుప్తంగా

## నల్లపోచమ్మదేవి ఆలయంలో పూజలు


అరటిపండ్ల అలకరణలో నల్లపోచమ్మదేవి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేష్, విష్ణుష్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆషాఢమాసం తొలి ఆదివారం సందర్భంగా అమ్మవారిని అరటిపండ్లతో అలంకరించి నైవేద్యం సమర్పించారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి కుంకుమార్చన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

## కిటకిటలాడిన బంగారమ్మ దేవాలయం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్‌లో సెలవుదినం కావడంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులతో కాలకంరి బంగారమ్మ దేవాలయం కిటకిటలాడింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ పరిసర ప్రాంతాల్లో వనభోజనాలు సైతం చేశారు. ఆలయ పూజారి వేణుపంతులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ


కొట్టాలలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేస్తున్న నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆదివారం మాజీ సర్పంచ్ నరహరి, నాయకులు గౌరీరెడ్డి, కే రమేష్‌గౌడ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా పనులు ప్రారంభించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం నాలుగు విడతల్లో రూ.5లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## 'రైతు భరోసా, రుణమాఫీ కోల్పోయా'

శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తనకు రైతు భరోసా, రైతుబంధు డబ్బులు జమ కాలేదని శివ్వంపేటకు చెందిన రైతు సురేశ్ ఆదివారం వాపోయాడు. తనకు చండీ గ్రామ శివారులో 1-02 గుంటల భూమిలో వరిసాగు చేస్తున్నప్పటికీ వ్యవసాయ సిబ్బంది రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో తనకు ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

## పీఆర్టీయూ పదవి, సభ్యత్వానికి రాజీనామా


నవీన్‌కుమార్

వెల్దుర్తి(తూప్రాన్): జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు కృష్ణపై రాష్ట్ర కార్యవర్గం క్రమశిక్షణ చర్యలు తీసుకోవడాన్ని నిరసిస్తూ పీఆర్టీయూ మాసాయిపేట మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎవరిని విచారణ చేయకుండా ఏకపక్షంగా వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్ర కార్యవర్గ నిర్ణయాన్ని నిరసిస్తూ సంఘం ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

## అనారోగ్యంతో నటుడు మృతి


వీరేశ్

నర్సాపూర్: పలు సినిమాల్లో విలన్ సైడ్ క్యారెక్టర్‌గా నటించిన నీరుడి వీరేశ్(40) ఆదివారం మృతి చెందారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతాపూర్‌కు చెందిన నీరుడి వీరేశ్ గబ్బర్‌సింగ్, రెబల్, చెన్నై ఎక్స్‌ప్రెస్ (హిందీ), తడాఖా, అరవిందసమేత తదితర సినిమాల్లో విలన్‌కు సైడ్ క్యారెక్టర్‌గా నటించడంతో పాటు పలు సీరియల్స్‌లో విలన్ క్యారెక్టర్ చేశాడు. గత కొంతకాలంగా అతను పెరాలసిస్ వ్యాధితో బాధపడుతూ ఆదివారం మరణించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నీరుడి వీరేశ్‌కు భార్య శిరీష ఉన్నారు.

# జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం


ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న లబ్ధిదారుడు

- మండలానికి 436 ఇళ్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

రేగోడ్(మెదక్): పేదలకు ఇంటి నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో నిరుపేదల సొంతింటి కల నెరవేరుతోంది. లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి అధికారులు మంజూరు పత్రాలను అందజేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**203 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం**

రేగోడ్ మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 436 ఇళ్లను మంజూరు చేసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. త్వరితగతిన ఇళ్ల నిర్మించుకునేలా సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తూ తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఈ క్రమంలో లబ్ధిదారులు తమ ఇంటి పనులను ప్రారంభించి వేగవంతం చేశారు. ఇప్పటివరకు 436 ఇళ్లు మంజూరైతే.. ఇందులో 203 ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఇండ్లు సరిగా లేక నానా అవస్థలు పడ్డారు. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో ఆ కష్టాలు ఇక దూరం కానున్నాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


గజ్వాడలో స్లాబ్ లేవల్ వరకు వచ్చిన ఇల్లు

**రుణపడి ఉంటా**



ఇల్లు లేక చాలా అవస్తలు పడ్డా. సొంతింటి కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసినా ఇళ్లు మంజూరు కాలేదు. ప్రస్తుతం ఇళ్లు మంజూరు చేయడంతో ఇల్లు కట్టుకుంటున్నా. ప్రభుత్వానికి రుణపడి ఉంటా.

– బేగరి శంకరయ్య, ఆర్.ఇటిక్యాల

**ఇంటి బిల్లు రూ. లక్ష వచ్చింది**



ఇల్లు లేక ఇబ్బంది అయింది. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయడంతో ఇల్లు కట్టుకుంటున్న. స్లాబ్ వరకు కట్టడంతో ఇంటి నిర్మాణం బిల్లు రూ.1 లక్ష ఇచ్చారు. త్వరగా ఇల్లు పూర్తి చేస్తాను.

– సంతోష, గజ్వాడ

# తగ్గుతున్న మొక్కజొన్న సాగు


రాంపూర్‌లో సాగు చేసిన మొక్కజొన్న(ఫైల్)

చేగుంట(తూప్రాన్): రైతులు ప్రతి సంవత్సరం మొక్కజొన్న సాగును తగ్గిస్తూ వస్తున్నారు. పదేళ్ల క్రితం గ్రామాల్లో మూడు వేల ఎకరాలకు పైగా సాగు చేశారు. 2024 ఖరీఫ్‌లో 550 ఎకరాల్లో మాత్రమే మొక్కజొన్న పంట వేశారు. గ్రామాల్లో ఎక్కువగా బీడు భూముల్లో వర్షాధార పంటలు సాగు చేస్తున్నారు. మూడు నెలలు దాటగానే మొక్కజొన్న పంట చేతికొచ్చి కోత దశకు చేరుకునేది. క్రమంగా బీడు భూములను రియల్ వ్యాపారులకు అమ్ముకోవడంతో పాటు కోతుల గుంపులు మొక్కజొన్న పంటను పాడు చేస్తుండటంతో రైతులు సాగును తగ్గించారు. ఎక్కువమంది అన్నదాతలు వరి సాగుపై దృష్టి పెట్టడంతో మొక్కజొన్న సాగు తగ్గినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో జూన్ రెండో వారం నుంచి జులై మొదటి వారం వరకు మొక్క జొన్న పంట వేసుకునే అదను ఉన్నప్పటికీ ఇప్పటి వరకు మండలంలో కేవలం 150 ఎకరాల్లో సాగు చేసేందుకు భూమిని దున్ని సిద్ధం చేశారు. తక్కువ సమయం, ఖర్చు ఆదాతో పాటు ఎక్కువ దిగుబడి సాధించి రైతులకు లబ్ధి చేకూర్చే మొక్కజొన్న పంటపై అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.


చేగుంట శివారులో మక్క సాగు కోసం దుక్కి దున్ని సిద్ధం చేసిన రైతు

# కనీస సౌకర్యాలు కల్పించాలి

మెదక్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొండల్‌రెడ్డి


మురుగు కాలువను పరిశీలిస్తున్న సిటిజన్ ఫోరం నేతలు

మెదక్‌జోన్: మెదక్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత పాలక పక్షంపై ఉందని మెదక్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పలువురు సభ్యులతో కలిసి పట్టణంలోని ఆయా వార్డుల్లో తిరిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అనేక వార్డుల్లో కనీస సౌకర్యలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణ పరిధిలోని పిల్లికొటాల్ డబుల్‌బెడ్రూంల్లో, ఈశ్వర్ నగర్ కాలనీల్లో కనీసం సీసీ రోడ్లు, మురికి కాలువలు లేక అవస్థలు పడుతున్నారాన్నరు. మురికి నీరంతా రోడ్లపైకి రావటం, పిచ్చిమొక్కలతో వార్డులు నిండిపోయి ఉన్నాయన్నారు. అసలే వర్షాకాలం కావటంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందన్నారు. అలాగే, కోతుల బెడదతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, చేతుల్లో కవర్లు, బ్యాగులు పట్టుకుని మార్కెట్‌కు వెళ్లిని ఇంటికి క్షేమంగా తిరిగి రాలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిచో సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటీజన్ ఫోరం సభ్యులు భూపాల్‌రెడ్డి , ఆనందం, నరసింహులుగౌడ్, దశరథం, బాలేష్‌గౌడ్, సామ్యూల్, దయాసాగర్, నాగరాజు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మైనంపల్లి

పాపన్నపేట(మెదక్): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలను మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు ఆదివారం నర్సింగరావుపల్లిలో పరామర్శించారు. గ్రామానికి చెందిన లునావత్ పీర్యా, కెతావత్ పీర్యా కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. రామతీర్థంకు చెందిన గంగారం రోడ్డు ప్రమాదంలో మరణించగా, ఆయన కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ప్రశాంత్ రెడ్డి, షహెద్ పాషా తదితరులు ఉన్నారు.

## కార్మికుడి కుటుంబానికి సాయం

మనోహరాబాద్(తూప్రాన్): విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన పంచాయతీ కార్మికుడి కుటుంబానికి తోటి కార్మికులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని కాళ్లకల్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న అల్లాపూర్‌కు చెందిన మత్రి రాములు విద్యుత్ ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. దీంతో మండలంలోని తోటి పంచాయతీ కార్మికులు వారి కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

## యువతి అదృశ్యం

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువతి శనివారం ఇంటినుంచి వెళ్లి అదృశ్యమైంది. ఈ మేరకు ఆదివారం యువతి తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయసినట్లు ఎస్సై బాలరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. అదే గ్రామానికి చెందిన వ్యక్తి సదరు యువతిని తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

## ఇసుక అక్రమ రవాణా

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ఎల్లారం, రేజింతల్, నందికంది, సూరారం, ఆత్మకూర్ గ్రామాల్లోని వాగులో నుంచి అక్రమార్కులు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో అధికారుల కళ్లు కప్పివాగులో నుంచి ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మాదిగలకు రిజర్వేషన్ హక్కులు దక్కాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సైదులు

మెదక్ మున్సిపాలిటీ: మాదిగ సమాజానికి రిజర్వేషన్ హక్కులు దక్కాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బొజ్జ సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం మాదిగ ఉపకులాలైన బుడగ జంగాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏ.బాల్‌రాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి బొజ్జ సైదులు పాల్గొని ఎస్సీ రిజర్వేషన్, ఇతర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ సభ ఘనంగా నిర్వహించాలన్నారు. సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతల లేని నూతన సమాజ నిర్మాణం కాంక్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం తన ప్రయాణాన్ని కొనసాగిస్తుందన్నారు. మాదిగ సమాజానికి దక్కాల్సిన రిజర్వేషన్ హక్కుల కోసం పోరాడుతున్నట్లు తెలిపారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రతి మండల కేంద్రంలో గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి, సీనియర్ నాయకులు మురళి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు మాధవి మెదక్ మండల నాయకులు గట్టయ్య, పవన్, లక్ష్మణ్, రత్నయ్య, రవి, బుడగ సంఘాల మెదక్ జిల్లా అధ్యక్షుడు టేక్ శంకర్, టేక్ సుందర్, మహిళా నాయకులు సుగుణ, నర్సవ్వ, స్వాతి, ప్రమీల, మాధవి పాల్గొన్నారు.


బుడగ జంగాలతో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం

# కాలనీల సమగ్ర అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు: నూతన కాలనీల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తూ ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడ బీహెచ్‌ఈఎల్ మెట్రో ఎంక్లేవ్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల క్రితం ఏర్పడిన బీహెచ్‌ఈఎల్ మెట్రో ఎంక్లేవ్ కాలనీతో పాటు సమీప కాలనీల ప్రజల కోసం ఏడు కోట్ల రూపాయల నిధులు వెచ్చించి మౌలిక వసతులు కల్పించామన్నారు. కాలనీలో గుడి, మసీదు, చర్చి నిర్మాణల కోసం రూ.30 లక్షల సొంత నిధులు అందించామని గుర్తు చేశారు. త్వరలో మరో రూ.70 లక్షల కేటాయించి నిర్మాణాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 20 కాలనీలో ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందిస్తున్నామని.. మిగిలిన కాలనీలకు త్వరలోనే పైపులైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. నూతన కమ్యూనిటీ హాల్లో ఫ్లోరింగ్ నిర్మాణ పనులకు సొంత నిధులు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు సత్యనారాయణ, మల్లేశ్, బీహెచ్‌ఈఎల్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కొల్చారం(నర్సపూర్): ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొల్చారం(నర్సపూర్): మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాలలో 1994–95 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సంగాయిపేట ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై వచ్చి మధుర స్మృతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యను బోధించిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.


కొత్తపల్లిలో 1989-90 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం 1989–90 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. అప్పటి విద్యార్థులంతా, ఒకరినొకరు పలకరించుకుని, నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్, అంజయ్య, వినోద్, సంగమేశ్వర్, సుధాకర్ రెడ్డి, నగేష్, అన్నపూర్ణ, పద్మ, సుమిత్ర పాల్గొన్నారు.

# గురుకులం ఆవరణలో చెత్తచెదారం

సంగారెడ్డి క్రైమ్: ప్రభుత్వం చేపట్టిన వందరోజుల కార్యాచరణ పట్టణంలో జోరుగా సాగుతోంది. ప్రతిరోజు వార్డుల చొప్పున కార్యక్రమం జరుగుతుండగా కొన్నిచోట్ల మార్పు కనిపించడం లేదు. అధికారులు నామమాత్రంగా పనులు చేసి మమఅనిపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. స్థానిక కల్వకుంటలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకులం హాస్టల్ సమీపంలో చెత్త వేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు. గురుకుల ఆవరణ, చుట్టు పక్కల చెట్లు, ముల్లపొదలు పెరిగిపోవడంతో గురుకులం విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. గురుకుల ఆవరణలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


గురుకుల ఆవరణలో వేసిన చెత్త, వ్యర్థాలు

# ఇళ్లు అప్పగించకుంటే ఆందోళన చేస్తాం


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు మహిపాల్

జహీరాబాద్ టౌన్: లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను అప్పగించకుంటే ఆందోళనకు దిగుతామని సీపీఎం డివిజన్ నాయకులు మహిపాల్ హెచ్చరించారు. పట్టణంలోని నిర్వహించిన లబ్ధిదారుల సమావేశం ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హోతి(కె) వద్ద పేదల కోసం ఇళ్లను కట్టించిందన్నారు. రెండు సంవత్సరాల క్రితం రెవెన్యూ అధికారులు డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపట్టి సర్టిఫికెట్లను పంపిణీ చేశారని తెలిపారు. ఇళ్ల నిర్మాణం పనులు పూర్తయినా లబ్ధిదారులకు అప్పగించకుండా జాప్యం చేస్తున్నారని వాపోయారు. ఇటీవల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయడంతో 20 రోజుల్లో అప్పగిస్తామన్న అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇళ్లను అప్పగించకుంటే జులై నుంచి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు సలీమోద్దీన్, బక్కన్న లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అధ్వానంగా జహీరాబాద్ రోడ్లు

- అడుగడుగునా గుంతలు
- కొత్త కమిషనర్లు దృష్టి సారిస్తేనే మరమ్మతులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణం వేగంగా విస్తరిస్తోంది. అనేక సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పురపాలక పరిధిలో రోడ్లు దెబ్బతిని అధ్వానంగా తయారయ్యాయి. గుంతలు పడి పంట కాలువల వలె కోతలు ఏర్పడ్డాయి. సంవత్సరాలు గడుస్తున్నా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టడం లేదు. ధ్వంసమైన రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

జహీరాబాద్ పట్టణంలో సుమారు లక్ష జనాభా, 37 వార్డులు ఉన్నాయి. వాహనాల రద్దీ కూడా ఎక్కువై ఎక్కడ చూసిన ట్రాఫిక్ సమస్య కనిపిస్తుంది. పట్టణంలోని ప్రధాన రోడ్లపై ఎక్కడ చూసిన గుంతలే కనిపిస్తున్నాయి. అంతర్గత రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైనా తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. పట్టణంలోని బ్లాక్ రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం, కోర్టు, మున్సిపల్ కార్యాలయం, హౌసింగ్‌బోర్డు, దత్తగిరికాలనీ, శాంతి నగర్, హనుమాన్ మందిరం, భవానీ మందిరం తదితర కాలనీల్లో దశాబ్దాల క్రితం సీసీ రోడ్లు వేశారు. నాసిరకం పనుల కారణంగా త్వరగా గుంతలుపడ్డాయి. వాటర్ పైపులైన్, కేబుల్ తీగలు తదితర పనుల కోసం రోడ్లను అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. దీంతో రోడ్లు దెబ్బతిన గుంతలమయంగా మారుతున్నాయి. గుంతలు తవ్విన ప్రాంతంలో తిరిగి కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయడం లేదు. వర్షాలు కురిసినప్పుడు నీరు చేరి గుంతలు ఉన్న విషయం తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామ పంచాయతీ పరిధిలోని మహీంద్ర కాలనీ, ఆనంద్‌నగర్, కాలనీ, జర్నలిస్టు తదితర కాలనీల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. గుంతలు పడిన రోడ్లపై వెళ్లడానికి వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ పట్టణ రోడ్లపై దృష్టి సారిస్తే ప్రయోజనం ఉంటుందని పట్టణవాసులు కోరుతున్నారు.


గుంతలు పడి దెబ్బతిన్న మహీంద్రకాలనీ రోడ్డు


దెబ్బతిన్న బ్లాక్ రోడ్డు